

'సలాది'కి యుటిఎఫ్ అభినందన


అభినందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-ఆలమూరు

సార్వత్రిక ఎన్నికలో కొత్తపేట ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు సత్యానందరావుకు విజయానికి కారుకులైన మండల టిడిపి నాయకులు సలాది నాగేశ్వర రావును ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలుతెలిపింది. అలాగే మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను ఎంఎల్ఎ బండారు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సలాది అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మం డల అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, రాష్ట్ర నాయకులు వైవివి.రమణ, సత్యవేణి, రమేష్, శ్రీనివాస్, చంద్రమోహన్, ముస్తఫాతదితరులు పాల్గొన్నారు.

1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం


రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పింఛన్లు జూలై 1న పంపిణీకై సమగ్ర ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతాధికారులు అమరా వతి నుండి వీడియో కాన్ఫరెన్స్ వివిధ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించి నూతనంగా పెంచిన సామాజిక బాధ్యత పింఛన్ల పంపిణీపై జిల్లా కలెక్టర్లకు, డిఆర్‌డిఎ పథక సంచా లకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పెన్షన్ నిధులు మరో వెయ్యి రూపాయలు పెంచుతూ పథకం పేరును ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంగా నామకరణం చేసిందన్నారు. ఆ మేరకు జూలై 1న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ కింద నెలవారి చెల్లింపును రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ రూ.3000 నుంచి రూ.4000 కు పింఛన్ పెంచిన కేటగిరిలో కోనసీమజిల్లా వ్యాప్తంగా వద్ధాప్య పింఛన్లు 1,29,297 ఉన్నాయని, వితంతు పింఛన్లు 49,806, చేనేత కార్మికుల పింఛన్లు 5,252, కల్లుగీత కార్మిక పింఛన్లు 3,241, మత్స్యకార పింఛన్లు 5,373, ఒంటరి మహిళా పింఛన్లు 4,557, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు పింఛన్లు 726, ట్రాన్స్ జెండర్స్ పింఛన్లు 20, డ్రం కళాకారులు పింఛన్లు 741, కళాకారులు పింఛన్లు 164 ఉన్నాయని తెలిపారు, రూ.3000 నుంచి రూ.6000వేలకు పెంచిన పింఛన్లు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

వికలాంగులకు సంబంధించి 32,681 పింఛన్లు ఉన్నా యని, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ పింఛన్లు122 ఉన్నాయన్నారు. రూ.5000 నుంచి రూ.15 వేల వరకు పెంచిన పింఛన్లకు సంబం ధించి పూర్తిగా వికలాంగత్వం కలిగిన పింఛన్లు 367 ఉన్నాయని ఈ క్యాటగిరి లోనే పక్షవాత పింఛన్లు 114 ఉన్నాయని తెలిపారు. రూ.5000 నుంచి రూ.10వేల వరకు పెంచిన పింఛన్లకు సంబంధించి మూత్ర పిండాలు, తలసేమియా కేసులు మొదలగు పింఛన్లు112 ఉన్నా యని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లాలో 22 మండ లాల పరిధిలో మొత్తం పెన్షన్లు 2,43,529 ఉండగా వీరికి జూలై 1వ తేదీన రూ.160 కోట్ల, 89 లక్షల 57 వేలు గత మూడు నెలల బకాయి 3 వేల తో కలిపి ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.7000 మొత్తంగా చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ యొక్క పింఛన్ల పంపిణీకి ఎంపిడిఒ, తహశీల్దార్,మండల వ్యవసాయ అధికారి, గ్రామ సచివాలయాల ప్రభుత్వ సిబ్బందికి ఒక్కొక్క ఉద్యోగి 50 మందికి పింఛన్లు చెల్లించే విధంగా మ్యాపింగ్ చేశామన్నారు. జూలై ఒకటో తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌దారుల ఇంటింటికీ వెళ్లి పంపిణీ ప్రక్రియను ప్రారంభించి ఒక్కొక్కరికి కేటాయించిన 50 పింఛన్లను అందించాలని అనివార్య కారణాలవల్ల మిగిలిపోయిన పింఛ న్దారులకు మరుసటి రోజున తప్పని సరిగా అందించాలని ఆయన ఆదే శించారు. పంపిణీకి సంబంధించి ఈ నెల 29వ తేదీనే బ్యాంకుల నుంచి అవసరాల మేరకు నగదును విత్ డ్రా చేసుకొని పోలీసుల సహకా రంతో భద్రపరుచుకోవాలని ఆయన సూచించారు. పింఛన్ల పంపిణీలో నగదు మొత్తం ఎక్కువగా ఉన్నందున భద్రతాపరంగా పోలీసులు సహకారం అందించడం జరుగు తుందని తెలిపారు. బ్యాంకర్లు కూడా ఈనెల 29వ తేదీ శనివారం ఉదయానికి నగదును సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రక్రియను పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని ఆయన సూచించారు నగదు అందుబాటు బ్యాంకుల్లో నగదు విత్‌డ్రా, తరలింపు అంశాల్లో జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. డేటా బేస్ ఆధారంగా పింఛన్‌దారుల బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్స్, కౌంటర్ ఫైల్, ప్రాపర్ ఎకనాలజ్మెంట్ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా నిధులు రీకన్సిలేషన్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రక్రియ సులభతరంగా పూర్తి చేసేందుకై ఆవాసాలు రూట్ల వారీగా సిబ్బందిని మ్యాపింగ్ చేయాలని సూచించారు ప్రశాంత వాతావరణంలో పెంచిన పింఛన్లను సజావుగా అందించాలని ఆయన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పథక సంచాలకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పథక సంచాల కులు వి శివ శంకర్ ప్రసాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మంత్రి తనిఖీలు

- రోగులను మెడికల్ టెస్ట్‌ల కోసం బయటకు పంపడం, ఆస్పత్రిలో అధిక రేట్లపై మందుల అమ్మకంపై ఆగ్రహం


ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌తో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, రామచంద్రపురం ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్ గురువారం ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు రికార్డులను తనిఖీ చేసి పలు విషయాలపై ఆరా తీశారు. బ్లడ్ టెస్ట్‌లకు, ఎక్స్‌రేలకు స్కానింగ్‌లకు అన్ని పరికరాలు ఉన్నా సరే పేషెంట్లను బయటకు ఎందుకు పంపుతున్నారని ఆయన ఆరా అసలు ఇక్కడ ఏం జరుగు తుందంటూ ఆయన మండిపడ్డారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌ను వీటిపై నిలదీశారు. ఆసుపత్రి ఆవరణలో గల జనరిక్ మెడికల్ షాపులో మెడిసిన్ అత్యధిక రేట్లకు అమ్ముతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఒపి విభాగం, ఎక్స్ రే గది, కం ప్యూటర్ విభాగం, మందులు , ఆసుపత్రి అభివృద్ధి పనులు వివరా లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులు సక్రమంగా నిర్వహిం చాలని సూచించారు.ఆయన వెంట టిడిపి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

సమగ్ర శిక్ష అభియాన్ లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరు సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ని కలిసి జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు, ఎంతో కాలంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని ఈ సందర్భంగా వారు తాము అనేకసార్లు సమస్యలపై సమ్మె చేశామని సమ్మె జీతాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ, పెండింగ్ వేతనాలు గురించి మంత్రికి వివరించారు, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సంవత్సర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి ఛైర్మన్ సి. హెచ్. వెంకన్న బాబు, ఇతర విభాగాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు

రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కంప్యూటర్లు ఆపరేటర్లు సంఘం నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు రెగ్యులర్ చేయాలని, ఖాళీలు ఉన్న పోస్టుల్లో నియమించాలని, జీతాలు పెంచాలని గ్రేడ్-4, గ్రేడ్-5 ఖాళీలలో భర్తీ చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా వారు 'ప్రజాశక్తి'కి వివరించారు.

వెదురుమూడిలో రహదారి మార్జిన్ ఆక్రమణ


రహదారి మార్జిన్ ఆక్రమించి ఏర్పాటైన నిర్మాణం

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం, అంగర, వెదురుమూడిలో ఆర్‌అండ్‌బి రహదారి మార్జిన్‌ను దర్జాగా ఆక్రమిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ ఆక్రమణలకు అడ్డుచెప్పేవారు లేరు. అంగర సమస్యకు వస్తే ముందుగా పంచాయతీ స్థలాలు ఎక్కడ ఖాళీగా ఉన్నాయని రెక్కీ నిర్వహించి ఎక్కడ ఖాళీ స్థలం కనపించినా పాగా వేసేస్తున్నారు. రహదారి పక్కన సాగు భూములు ఉన్నవారు మార్జిన్ ఆక్రమించి ఫెన్సింగ్, కలప వేస్తున్నారు. రోడ్లు ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనాలు ఎదురె దురుగా వస్తే తప్పుకునే అవకాశం లేక ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనదారులు, ప్రయాణికులు సైతం ప్రమాదాలకు గురవు తున్నారు. అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బి రోడ్ల ఆక్రమణలను తొలగించి రోడ్లను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ


గెయిల్ విస్ఫోటనంలో మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ప్రజాశక్తి -మామిడి కుదురు

గెయిల్, ఒఎన్‌జిసి అధికారులతో చర్చించి గ్రామాభివృద్ధికి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పి గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు నగరంలో గురువారం గెయిల్ పైపులైన్ విస్ఫోటం మతుల సంస్కరణ సభలో పాల్గొన్నారు ఈ విస్ఫోటములో మతి చెందిన 22 మంది చిత్రపటాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, లూటు కుర్రు సర్పంచ్ అడబాల తాత కాపు, మండల జనసేన అధ్యక్షులు జాలెం శ్రీనివాస రాజా, పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, జాలెం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫిడర్ పరిధిలో మరమ్మతులు మరియు ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఎపి ఇపిడిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ముమ్మిడివరం టౌన్‌ఫీడర్-1, 2 ఠానేలంక, అయినాపురం, కొత్తలంక, అనాతవరం ఆర్ డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధిలోని గ్రామాలైన ముమ్మిడివరం, పల్లిపాలెం, రాజుపాలెం, నడిమిలంక, చిప్పలపాలెం ఠానేలంక, లంకఆఫ్‌ఠానేలంక, క్రాప చింతలపూడి, క్రాప చింతలపూడిపాలెం, అనాతవరం, సిహెచ్.గున్నేపల్లి, అయినా పురం, సోమిదేవరపాలెం, కొత్తలంక, చినకొత్తలంక, మర్లపాలెం, కర్రివాని రేవు, వడ్డిగూడెం, గేదెల్లంక, గాడిలంక, కోమానపల్లి, అన్నంపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

కాట్రేనికోన: విద్యుత్ సరఫరాకు నేడు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కాట్రేనికోన మండల పరిధిలో 11 కెవి చెయ్యేరు ఫీడర్ ఓవర్ లోడ్ కారణంగా వర్క్ చేస్తారన్నారు. చెట్లు తొలగింపు పనులు చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని రవికుమార్ తెలిపారు.

కార్టూ'నిజం'



స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి

డిపిఒ రాంబాబు


తాగునీటి ట్యాంకులను పరిశీలించి ఆదేశాలిస్తున్న డిపిఒ రాంబాబు

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేసేందుకు లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి(డిపిఒ) డి.రాంబాబు సిబ్బందికి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రం ఆలమూరులోను, పెదపల్ల, సందిపూడి, చింతలూరు తదితర గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను, పరిసరాలను ఆయన పరిశీలించి, సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా వ్యాధి ప్రబలుతోందని దాన్ని అరికట్టే ప్రయత్నాలు అన్ని శాఖలు సమన్వయంగా చేపట్టాలన్నారు. ఈ వ్యాధి సోకకుండా మన పరిధిలోని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఎక్కడ మురుగునీటి నిల్వలు ఉండకూడదని, ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తద్వారా దోమలు వద్ధి చెంది వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్యం మెరుగుదలకు అనునిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని గ్రామ సిబ్బందికి ఆయన ఆదేశించారు. దీంతో పాటుగా క్లోరినేషన్ చేసిన పరిశు భ్రమైన నీటిని మాత్రమే కుళాయిల్లో సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకుల లోపల పరిశుభ్రత లోపించిన, నాణ్యమైన తాగునీరు సరఫరాలో ఫిర్యాదులు అందిన తగు చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆయన సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.మేరీ రోజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జె పి.పద్మ, కార్యదర్శులు కె.సంజీవరెడ్డి, వి.వేణు, ఎస్.వీర్రాజు, వెంకటరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రరావుకు ధర్మోజీరావు స్మారక అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న పీతల రామచంద్రరావు

ప్రజాశక్తి-రాజోలు

చిత్రలేఖనంలో అందించిన విశిష్ట సేవలకు చిత్రకారుడు పీతల రామచంద్రరావుకు ప్రతిష్టాత్మకమైన స్వర్గీయ డాక్టర్ గుబ్బం ధర్మోజీరావు స్మారక అవార్డు లభించింది. ఈ మేరకు తాటిపాక గ్రామంలో గురువారం జరిగిన స్వర్గీయ డాక్టర్ గుబ్బం ధర్మోజీరావు 7వ సంస్మరణ సభలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల దళిత చైతన్య వేదిక స్వర్గీయ డాక్టర్ గుబ్బం ధర్మోజీరావు స్మారక అవార్డును తనకు ప్రదానం చేసిందని తెలిపారు. జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ ఇసుకపట్ల రఘుబాబు, వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబు, దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, సమన్వయ కర్త బత్తుల జనార్ధనారావు, దళిత చైతన్య వేదిక కార్యవర్గ సభ్యుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు పీతల రామచంద్రరావు తెలియచేసారు. చిత్రలేఖనంలో చేసిన సేవలకు అవార్డు అందుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. రామచంద్రరావును సిపిఎం రాష్ట్ర నాయకులతో పాటుగా నియోజకవర్గ ఎస్‌సి సంఘాల నాయకులు, ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి


ముమ్మిడివరంలో జరిగిన బొజ్జాతారకం జయంతి సభల పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు రిపబ్లికన్ పార్టీ నాయకుడు పెనుమాల సుధీర్ అధ్యక్షతన గురువారం బొజ్జా తారకం జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అయితా బత్తుల రామేశ్వర రావు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న బొజ్జా తారకం తొలితరం ప్రజాపోరాటాల వీరుడు, బడుగు బలహీనర్గాల హక్కుల గొంతుక, కవి, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, న్యాయవాదిగా పేద బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పోరాట యోధుడిగా నిలిచారని కొనియాడారు. మరో అతిథి పిసిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగా గౌతమ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరి రక్షించాలంటే పెట్టుబడిదారీ విధానం, మనువాద విధానాలపై తారకం చేసిన పోరాటాల స్ఫూర్తితో పోరాడటమే శరణ్యం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ కంచికి చెర్ల కోటేశు కేసులో న్యాయపోరాటం చేయడమే కాకుండా దళితులపై జరిగిన కారంచేడు, నీరుకొండ,పదిరి కుప్పం, చుండూరు, లక్ష్మింపేట, వెంపేట బాధితులకు అండగా ఉండి కేసులను సుప్రీమ్ కోర్టు వరకు తీసుకువెళ్లి దోషులకు శిక్ష పడే విధంగా పోరడారన్నారు. అనంతరం హైదరాబాద్ బొజ్జా తారకం ట్రస్ట్ ప్రచురించిన బుద్ధుని ప్రవచనం పుస్తక ప్రతులను నగర పంచాయతీ ఛైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక బుద్ధ పార్కు అవరణలోని బుద్ధ విగ్రహం వద్ద బంతేజి బుద్ధ వందనం చేయగా అంబేద్కర్ మరియు తారకం విగ్రహాలకు అయితా బత్తుల రామేశ్వరరావు, జంగా గౌతమ్, చికురు మిల్లి చిరంజీవి కాశి వెంకటరమణలతో పాటు పలువురు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో మానవ హక్కుల నాయకులు ఎ.రవి, పెయ్యల పరశురాముడు, రవితేజ, ఎస్.పథ్వీరాజ్, నల్లా సూర్య ప్రకాష్‌మూర్తి, పల్లి దేవదానం తదితరులు పాల్గొన్నారు.


ఆటో కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

ఆటో కార్మికుని కుటుంబానికి రూ.40 వేల సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఎపి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీదుగా రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని తోట పేట గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు కొండేటి నరేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు విషయం తెలిసిన ఆటో కార్మికులు శ్రీలక్ష్మి గణపతి గూడ్స్ ఆటో యూనియన్ సంఘం సహాయంగా రూ.30 వేలు సమకూర్చారు. దీనికి మంత్రి మరో రూ.10 వేలు కలిపి మొత్తం రూ.40వేలు, కొండేటి నరేష్ భార్య కొండేటి సూర్యభవానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూరాలజీలో 3వ ర్యాంక్ సాధించిన సంజయ్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సాకుర్రు గ్రామానికి చెందిన తాడి కొండ తాతీయులు, కామేశ్వరీల మనవడు డాక్టర్ తాడికొండ సంజయ్‌కి న్యూరాలజీలో ఇండియాలో 3వ ర్యాంక్ సీటు సాధించి బెంగుళూరు నిమ్స్ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు. ఈ సందర్భం గా గురువారం సంజయ్ ని స్థానిక ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అభినందిం చారు. ఇండియాలోనే 3వ ర్యాంక్ సాధించి న్యూరోసర్జన్ గా సీటు సాధించడం గొప్ప విషయం అని సంజయ్ తోపాటు వారి కుటుంబసభ్యులను కూడా ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, మాజీ సర్పంచ్ చొల్లంగి సాయిబాబు, బూత్ కన్వీనర్ ఎంవి.రమణ, పులవర్తి కృష్ణారావు, తాడికొండ తాతీయులు,తాడికొండ వెంకన్నబాబు పాల్గొన్నారు.


సాకుర్రులో ర్యాంకర్ సంజయ్‌ను అభినందిస్తున్న అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు

కవి సమ్మేళనం కరపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

అంతర్జాతీయ శ్రీ శ్రీకళా వేదిక అధ్యక్షులు డాక్టర్ కత్తి మండ ప్రతాప్ నిర్వహణలో తెలంగాణకు చెందిన సూర్యారావుపేటలో జూన్ 30న జరుగనున్న 136వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం కవితోత్సవం కార్యక్రమం నిర్వహిం చనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచరును అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. ఆనందరావు పుట్టినరోజు సందర్భంగా శ్రీ శ్రీ కళావేదిక జిల్లా శాఖ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసింది జిల్లా కన్వీనర్ డాక్టర్ బివివి సత్యనారాయణ, సాహితీవేత్త డాక్టర్ నల్లా నరసింహమూర్తి, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున సత్యనారాయణ, ఎ.ప్రభుదాస్, బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

29న పిడిఎస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఈనెల 29న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలని పిడిఎస్‌యు నాయకులు బి.సిద్ధూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామచంద్రపురం పట్టణంలో స్థానిక ఎస్‌సి అంబేద్కర్ బాయ్స్ కళాశాల హాస్టల్లో పిడిఎస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు.కార్యక్రమంలో రామచంద్రపురం పిడిఎస్‌యు నాయకులు ఎస్.సుబ్బారాయుడు, హర్ష, పి.బాలాజీ, సిహెచ్.లక్ష్మణ్, ఎస్.సూర్య, జీ.అజయ్, వి.తరణ్, ఎస్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది 'రేకపల్లి' మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం పట్టణానికి చెందిన న్యాయవాది, సాహితీవేత్త రేకపల్లి శ్రీనివాస మూర్తి(81) గుండెపోటు తో మరణించినట్లు గురువారం ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కవిగా శ్రీనివాసమూర్తి సుమారు 60 శతకాలను రచించారు. సాహితీ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, అమలాపురం పరిసరప్రాంతాలలో వందలకొలది సాహిత్య సభలను నిర్వహించారు. శ్రీ అన్నమయ్య ఉత్సవ కమిటీ, రోటరీ క్లబ్, అమలాపురం బార్ అసోసియేషన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా, పురపాలక సంఘ మాజీ ప్రతిపక్ష నాయకుడిగా స్థానికంగా అనేక పదవులు నిర్వర్తించారు. శ్రీనివాసమూర్తి మృతి తీరని లోటని పలువురు ప్రముఖులు అన్నారు.

నేరాలు ఘోరాలు


లారీ టైరు కింద నలిగిపోయిన మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం..పెద్దాపురం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన చంద్రపాటి లావరాజు(44) మండలంలోని మల్లేపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం మోటారు సైకిల్ పై పామాయిల్ గెలల కోసేందుకు లింగపర్తి వెళ్లి పని ముగించుకుని తిరిగి మల్లేపల్లి వస్తుండగా నీలాద్రి రావు పేట సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు,


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

బస్సు, వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆర్‌టిసి బస్సు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యాన్‌లోని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నల్లజర్లలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఏలూరు నుండి రాజమండ్రి వెళుతున్న ఆర్‌టిసి బస్సును నల్లజర్ల వైపు నుండి ఏలూరు జిల్లా గాలాయగూడెంకు వెళుతున్న బొలేరో వ్యాన్ రాంగ్ రూట్లో బస్సుకు ఎదురుగా వచ్చి ఢీకొంది. అనంతరం పక్కన ఉన్న రేకుల షెడ్డు ఢీకొని పంట కాలవలోకి వెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 55 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో బస్సులో ముందు సీట్లో కూర్చున్న మహిళకు కాలు బెణకడంతో స్థానిక పిహెచ్సి నందు ఫస్ట్ ఎయిడ్ అనంతరం ఆమెను పంపించి వేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాన్లోని వ్యక్తులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న నెహ్రూ అభిమానులు

ప్రజాశక్తి-గోకవరం

ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు భారీ విజయం దక్కడంతో జగ్గంపేట నియోజకవర్గంలో ఊరూరా నెహ్రూ అభిమానులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇందులో భాగంగా నెహ్రూ అనుచరుడు టిడిపి గోకవరం మండలం తంటికొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగం వెంకటపతి శ్రీవారి మెట్ల మార్గం ద్వారా 2,388 మెట్లు కాలినడక ఎక్కి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుమార్తె వివాహానికి నవీన్

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పాలాడి శ్రీనివాస్ కుమార్తె వివాహానపికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ హాజరయ్యారు. గురువారం గోకవరంలో స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని వధూవరులు ఆషిక జోషి, వీర ప్రభువులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

90 రోజుల విద్యా ప్రణాళికపై దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట

పాఠశాలల్లో 90 రోజుల విద్యా ప్రణాళికను విధిగా ఉపాధ్యాయులు పాటించాలని ఎంఇఒ-1 వై.శివ రామకృష్ణయ్య అన్నారు. గురువారం మండలం లోని పనసపాడు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, పరిసరాల శుభ్రత, మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. భాషా నైపుణ్యాలు, చతుర్విధ ప్రక్రియలు ఎలా ఉన్నాయనే విషయంపై, వర్క్‌బుక్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఉదయం విశ్రాంతి సమయంలో విద్యార్థులకు పోషకా హారంగా ఇచ్చే వేరుశనగ చిక్కీ, రాగిజావలపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం రుచిచూశారు. ప్రస్తుతం జరుగుతున్న అడ్మిషన్ నమోదు, డ్రైవ్ వేగవంతం చేసి 90 రోజుల విద్యా ప్రణాళిక అమలును పరిశీలించారు. బడి ఈడు పిల్లలను బడిలో నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల స్థాయిని తెలుసుకుంటున్న ఎంఇఒ

1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జులై 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిఆర్‌డిఎ, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. జులై నెలలో చేపట్టబోయే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ ప్రణాళిక, చంద్రన్న బీమా క్లెయిమ్స్ పరిష్కారం, స్త్రీ నిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసిన రుణాలు వివరాలు, స్వయం సహాయక సంఘాల, సభ్యులకు స్వయం ఉపాధి నిమిత్తం కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను రానున్న జూలై నెల నుంచి ఎన్‌టిఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనున్నదన్నారు. జూన్ నెలలో సామాజిక భద్రత పింఛన్ల కింద జిల్లాలో



2,79,805 మందికి రూ.82.90 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్‌టిఆర్ భరోసా పేరుతో 17 రకాల పింఛన్లు జిల్లాలో 2,79,319 మందికి రూ188.40 కోట్ల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మూడు వేలు, నూతనంగా పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై 1న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్ సొమ్ము సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకు కిందిస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు తెలియజేసి, సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో 39,532 స్వయం సహాయక సంఘాల్లో 4.08 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని ఆయన తెలిపారు. వారికి మంజూరు చేసే స్త్రీనిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసే రుణాలు, రికవరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు స్వయం ఉపాధి మార్గాలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, డిపిఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'డయేరియా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు'

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో డయేరియా వ్యాధి పట్ల ప్రజలెవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, డయేరియా నియంత్రణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సగిలి షాన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సి పాలిటీలతోపాటు వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంచి నీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగు తుందన్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహి స్తున్నామని, తాగునీరు పైపులైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మతుల పనులు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరం తరం రోజుకు రెండుసార్లు చొప్పున సాగుతు న్నాయని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఐరన్ టాబ్లెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఇంటింటికి సర్వే నిర్వ హించి ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటే వారిని గుర్తించి వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల డయేరియా అనుమానం కేసులను ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని, వారికి ఎటువంటి ప్రమా దం లేదని, ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే వారిని ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని వివరించారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన వేడి నీళ్లు మాత్రమే తీసుకోవాలని, ఇంటిలోనూ, పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవడం తోపాటు, మంచినీటి నిల్వచేసే బిందులు, డ్రమ్ములను కూడా శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగ్గంపేటలో సుమారు 2వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని, అయితే ఇదే గ్రామంలో 500 మంది వరకూ ఇళ్లు లేని పేదలు ఉన్నారన్నారు. కావున తక్షణమే జగ్గంపేట గ్రామంలో జగనన్న కాలనీ ఆనుకుని ఉన్న స్థలాన్ని వీరికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కడితి సతీష్, కె.రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, ఎల్లే సత్తిబాబు,నాగమణి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హెలెన్ కిల్లర్ 144వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వాసవి ఉమెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ సర్వలక్ష్మి పాల్గొని మాట్లాడారు. హెలెన్ కిల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బి.కాశీఅన్నపూర్ణ, ట్రెజరర్ పి.సరస్వతి, సభ్యులు బి.శీతల్, మహాలక్ష్మి, సిహెచ్.నాగలక్ష్మి, బి.తోషిత, కె.వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, సుధాకర్, ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగ ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత పిలుపునిచ్చారు. గురువారం కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం తరలింపుపై నిర్వహించిన వ్యాసరచనలో విజేతలకు బహుమతులు ప్రదానం కార్యక్రమం జరిగింది. మొదటి బహుమతి పి.రాజ్‌కుమార్, రెండో బహుమతి యు. సుసన్నారాణి, మూడో బహుమతి యు.మహేష్ గెలుపొందినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, శ్రీలక్ష్మి, సురేష్, శివప్రసాద్, మదీనా, బంగార్రాజు, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మనోవేదనకు చికిత్స అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రకృతి వైపరీత్యాలు, కారు ప్రమాదాలు, లైంగిక వేధింపుల వంటి ప్రాణాంతక సంఘటనల అనుభవాలు తర్వాత వచ్చే మనో వేదనను చికిత్స ద్వారా నయం చేయవచ్చని డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మనోవేదన నివారణ దినోత్సవం పురస్కరిం చుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్టకరమైన సంఘటనలకు సంబంధించి జ్ఞాపకాలు చాలా కాలం వరకు వెంటాడుతాయని అన్నారు. అటువంటివారు నిస్పృహకు లోన వ్వడం, ఆందోళన చెందడం, మత్తు పదార్థాలకు అలవాటు పడతారని అన్నారు. వీరికి మందుల ద్వారా చికిత్స అందిస్తే కొద్ది ఆలస్యమైనా తేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదస్సులో అడబాల రత్నప్రసాద్, రాజా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

తిమ్మాపురంలో నేను బడికి పోతా...

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో నే బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు అందరిని బడిలో చేర్చాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీజనల్, అతిసార వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో 10 మంది అంగన్‌వాడీ బాలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌వర్మ, ఎఎన్ఎం పి.నాగమణి, మహిళా పోలీసు లీలారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ పరంజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్స్ యేసు రత్నకుమారి, సత్యవతి, సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా బొజ్జా తారకం జయంతి

ప్రజాశక్తి-కడియం

పొట్టిలంకలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం బొజ్జా తారకం జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ కోణాల లాజరు కేక్ కట్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్న రాజు మాట్లాడుతూ బొజ్జతారకం హైకోర్టులో న్యాయవాదిగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఉద్యమాలకు న్యాయకత్వం వహించారని, కోర్టుల్లో న్యాయపోరాటం చేసేవారని తెలిపారు. కారంచేడు నరమేధం తర్వాత హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది పదవికి రాజీనామా చేసి దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా చంటి బాబు, అంబటి రాజారత్నం, రేముల్లా ఏసు, కొల్లపు వీరన్న, బెల్లామను శివాజీ, మొఘలపు రాజు, గుర్రం రాజు, గుమ్మడి అర్జున్, జక్కల నాని, బడుగు వెంకీ, యాళ్ల సురేష్, దాసి సంతోష్, నెల్లి నవీన్, పల్లి భీమరాజు, బడుగు యోహాను, తదితరులు పాల్గొన్నారు.


తారకంకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

బాధితులకు మానవ హక్కుల సంఘం పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అతిసారా వ్యాధి లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగులను జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ గురువారం పరామర్శించారు. వాంతులు, విరోచనాలతో బ్రౌన్‌పేట, కుమ్మరివీధి ప్రాంతాలకు చెందిన పలువురు చికిత్స పొందుతుండగా వారి యోగ క్షేమాలను అప్పలకొండ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ పి.అమలను కలిసి పట్టణంలో అతిసార పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కొత్తకేసులు నమోదు కాలేదని డాక్టర్ అమల చెప్పారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు ఎస్.రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న అప్పలకొండ

తిరుపతిలో పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. చెత్త పోగులను తొలగించటం, మురుగు కాలువల్లో పూడిక తొలగింపు, మంచినీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద

కడియం : అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియం నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద పరిరక్షణలో రైతుల కృషి అభినందనీయమని హైదరాబాద్ ఎటిఎఆర్ఐ డైరెక్టర్లు డాక్టర్ షేక్ ఎన్.మీరా, డాక్టర్ ఆర్‌కె.మాధుర్ అన్నారు. 72 మంది కృషి విజ్ఞాన కేంద్రాల సీనియర్ శాస్త్రవేత్తల బృందం కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీలోని స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఉద్యానవన మొక్కలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాధూర్, షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రదేశం కడియం ప్రాంతమని చెప్పారు. రాబోయే రోజుల్లో నర్సరీలు ఒక ఉద్యానవన హబ్‌గా మారగలవని అన్నారు. ఈ నర్సరీలలో ఉన్న కొన్ని వేల రకాల మొక్కజాతులు వాటి శాస్త్రీయ నామాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చునన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో గురుకులాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి సామాజికవర్గాల్లోని పేద పిల్లల కోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక గురుకులం పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం ఓ ప్రకటనలో కోరారు. గత టిడిపి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక నూతన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా ఆర్డినెన్స్ జారీ చేసిందని, అయితే వైసిపి అధికారం లోకి వచ్చాక వాటిని రద్దు చేసిందన్నారు. తిరిగి టిడిపి అధికారంలోకి రావడంతో ప్రతి నియోజకవర్గంలో బాల బాలికలకు నూతన గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

'తాగునీటి పరీక్షలు నిర్వహించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

గ్రామాలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా అతిసార వ్యాధి ప్రబలతుందని, కావున తక్షణమే తాగునీటిని ఆయా ప్రాంతాల వారీగా పరీక్షించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25శాతం లీకేజీలు ఉన్నాయని అన్నారు. అందుకే తాగునీరు లేత ఆకుపచ్చ రంగులోకి మారిపోతుందన్నారు. ఆ నీటినే ప్రజలు తాగుతున్నారని అన్నారు. కావున తక్షణమే తాగునీటి పరీక్షలతోపాటు, నీటి సరఫరా పైపులైన్‌లను మార్పు చేయాలని ఆయన కోరారు.

మహిళలకు పని ప్రదేశంలో భద్రత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా, మహిళల రక్షణ కమిటీ' ఏర్పాటు చేసి నివేదిక అందచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. గురువారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి, డిఆర్ఒ జి.నరసింహులుతో కూడిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ, పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపుల ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ '14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం కోసం స్త్రీ ప్రాథమిక హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే, జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణానికి హక్కును కలిగి ఉన్నారన్నారు. అందులో భాగంగా మహిళలు స్వేచ్ఛగా భద్రతా కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం లేదా వ్యాపారాన్ని నిర్వహించడానికి అనువైన వాతావరణం కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. దీనిలో భాగంగా ఆయా పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ అన్ని పరిపాలనా కేంద్రాల్లో లేదా కార్యాలయాల్లో తక్షణం ఏర్పాటు చేస్తూ, వారి వివరాలతో కూడిన నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి మాట్లాడుతూ, మహిళలకు పని చేసే ప్రదేశంలో భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్ భరత్